# ప్రతిష్ఠాత్మక పదవిలోకి తోటకూర ప్రసాద్



డలాస్/ ఫోర్టువర్త్‌కు చెందిన ది వరల్డ్ అఫైర్స్ కౌన్సిల్ వారు.. ప్రముఖ ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ లీడర్ ప్రసాద్ తోటకూరను తమ సంస్థకు బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్‌లో ఒకరుగా ఎంపిక చేశారు.

అరవయ్యేళ్ల ది వరల్డ్ అఫైర్స్ కౌన్సిల్ చరిత్రలో తెలుగు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఇంత ఉన్నత పదవిలో బాధ్యతలు నిర్వర్తించడం ఇదే ప్రథమం. ప్రసాద్ తోటకూర ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్, అల్కాటెల్ ల్యూసెంట్, రేథియాన్స్, ఎటీ అండ్ టీ, ఎగ్జాన్, హంట్ ఆయిల్, టిఐ, 7-ఎలెవెన్, ఎగ్జాన్ మొబైల్, లాక్‌హీడ్ మార్టిన్ లాంటి అనేక పెద్దసంస్థలకు చెందిన ప్రెసిడెంట్‌లు, సిఇఓలు, నాయకులు కూడా ఈ సంస్థలో డైరక్టర్లుగా ఉంటారు. గతంలో హాలిబర్టన్ డ్రెసర్ ఇంక్ కు సిఇఓగా ఉన్న పాట్రిక్ ముర్రే ఈ సంస్థకు చైర్మన్‌గాను, జిమ్ ఫాక్ సిఇఓ గాను వ్యవహరిస్తారు.



వివిధ కార్యక్రమాల ద్వారా అంతర్జాతీయంగా అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ ది వరల్డ్ అఫైర్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. "ఈ కొత్త బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ అందరూ అద్భుతమైన గ్రూపుగా పేరు తెచ్చుకోగలరని" ఈ సందర్భంగా సంస్థ సిఇఓ జిమ్ ఫాక్ పేర్కొన్నారు. ఉత్తర టెక్సాస్‌ను మిగిలిన ప్రపంచంతో ముడిపెట్టడానికి వీరంతా విశేషంగా పనిచేయగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ ఈ ది వరల్డ్ అఫైర్స్ కౌన్సిల్ ప్రతిష్ఠాత్మక బోర్డులో పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు. బోర్డులోని ఇతర సభ్యులతో కలిసి పనిచేస్తూ వారి అనుభవాల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఇది తనకు గొప్ప అవకాశం అని చెప్పారు. భారతీయ అమెరికన్ కమ్యూనిటీ ప్రతినిధిగా ఇక్కడ పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



ప్రసాద్ తోటకూర ప్రస్తుతం డలాస్ కన్వెన్షన్స్ అండ్ విజిటర్స్ బ్యూరో అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ డైరక్టర్‌గా ఉన్నారు. ఇంకా డలాస్ కిడ్స్ నీడ్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ డైరక్టర్‌గా, తానా ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్‌గా, ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ టెక్సాస్ స్టేట్ కోఆర్డినేటర్‌గా, మహాత్మాగాంధీ మెమోరియల్ డలాస్ ప్రాజెక్టు స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.